కలెక్టర్ వెట్రిసెల్వి నేడు బాధ్యతల స్వీకరణ

» పూర్వ కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ రిలీవ్





ఏలూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏలూరు జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రిసెల్వి బుధవారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె 2016లో మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా, 2014-19 మధ్య సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం ప్రత్యేకాధికారిగా, తర్వాత నెల్లూరు జేసీగా, ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. 2024 ఫిబ్రవరి నుంచి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. తాజా బదిలీల్లో ఆమె ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. వెట్రిసెల్వి 2014లో ఐఏఎస్‌లో 143వ ర్యాంకు సాధించారు. భూసమస్యల పరిష్కారంలో, ప్రజా సమస్యలను అర్థం చేసుకుని త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడంలో ఆమెకు మంచి పేరుంది.

ప్రసన్నవెంకటేశ్ రిలీవ్

కలెక్టర్ బాధ్యతల నుంచి మంగళవారం ప్రసన్నవెంకటేశ్ రిలీవ్ అయ్యారు. జిల్లాలో విధి నిర్వహణ పరంగా రెండున్నర ఏళ్లకాలం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. తనకు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలుపుతూనే ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించటానికి, వరదలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలవటంలోనూ తనకు సహకరించిన ప్రజలకు మీడియా, స్వచ్ఛంద సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. మహిళలు, పిల్లలు ఆరోగ్యపోషణపై దృష్టిసారించి సెయింట్‌థెరిస్సా కళాశాల సహకారంతో ఐటీడీఏ మండలాల్లో పిల్లలు, మహిళలు కోసం ప్రత్యేక చొరవ తీసుకునే విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. తనకు సహకరించిన అధికారులు అందరికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

డీఎల్‌ఎడ్ పరీక్షకు 67మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 25 : జిల్లాలో డీఎల్‌ఎడ్ 4వ సెమిస్టర్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం జరిగిన పరీక్షకు జిల్లాలో 67 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

శ్రీవారి కొండపై ఆక్రమణల తొలగింపు

ద్వారకాతిరుమల, జూన్ 25: శ్రీవారి శేషాచలంపై ఉన్న ఫ్యాన్సీ దుకాణదారులు తమకిచ్చిన పరిధిని మించి ముందుకు వచ్చి ఆక్రమించేయడం యాత్రికుల రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తుండడంతో ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవారం వాటిని తొలగించా రు. క్షేత్రంపై శ్రీవారి దేవస్థానం పలు పాటదుకాణాలను నిర్వహిస్తోంది. ఆలయ అనివేటి మండప సమీపంలో దుకాణాలను నిర్మించి దేవస్థానం వాటిని అద్దెప్రాతిపదికన ఇచ్చింది. దుకాణదారులు ముందుకు వచ్చి ఆ ప్రాంతాన్ని పరదాలతో ఆక్రమించేయడంతో యాత్రికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు కలుగచేసుకుని సెక్యూరిటీ సహకారంతో వాటిని తొలగించి ఇంకా ముందుకు రావద్దని దుకాణదారులను హెచ్చరించారు.



కొండపై దుకాణాల ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది.

నామినేటెడ్ కసరత్తు



ఐదేళ్లపాటు జగన్ సర్కార్‌లో ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమ కేసులను దీటుగా ఎదుర్కొన్న క్యాడర్‌ను ఈసారి అందలం ఎక్కించాలని టీడీపీ భావిస్తోంది. కూటమి పక్షాన జనసేన, బీజేపీ శ్రేణులకు కూడా అవసరమైన చోట్ల నామినేటెడ్ పదవులకు అవకాశం ఇవ్వాలనే భావిస్తోంది. ఇప్పటికే నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారందర్ని తక్షణం తప్పుకోవాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. వైసీపీలో ఆరితేరిన కొందరు ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఏదైతే అది అయిందిలే అన్నట్లుగా మొండివైఖరి అవలంబిస్తున్నారు. ఇంకోవైపు కూటమి పక్షాన నియోజకవర్గాల వారీగా, జిల్లాస్థాయిలో సీనియర్ల జాబితాను నేరుగా రప్పించడం ఆరంభించారు. ఇప్పటికే కొందరు సీనియర్ల గురించి ఆరా కూడా తీశారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు ఆశించి కూటమి కారణంగా కొన్నిస్థానాల్లో ఎమ్మెల్యే పదవులు కోల్పోయిన వారందరికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించారు. దీంతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు జగన్‌కు వ్యతిరేకంగా బహిరంగ పోరాటం చేసిన వారందర్ని గుర్తించి కీలక నామినేటెడ్ పోస్టుల్లో నియమించబోతున్నారు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కూటమి నేతలకు త్వరలో అందలం

» మార్కెట్ కమిటీలు.. కార్పొరేషన్ల పదవులకు ఎంపికలు
» కష్టపడిన వారికే ఈసారి గుర్తింపు
» ఇప్పటికే జాబితా రూపకల్పనలో నిమగ్నం
» రాజీనామాలకు మొండికేస్తున్న వైసీపీ నాయకులు
» తొలగింపునకే కూటమి ప్రభుత్వం సన్నద్ధత

కష్టపడిన వారికి ప్రతిఫలం

గడిచిన కొన్నేళ్ళుగా జగన్ ప్రభుత్వంలో ఎక్కడా జరగనన్ని అరాచకాలు జరిగాయి. ఒంటెద్దు పోకడలతో ప్రతిపక్షాలను ఇబ్బడిముబ్బడిగా ఒత్తిళ్ళకు గురి చేశారు. కొందరి ఆస్తులను తన్నుకుపోవడానికి ప్రయత్నించారు. ఇంకొందరిపై వరుసగా అక్రమకేసులు బనాయించారు. అయినా నమ్ముకున్న పార్టీ జెండా వదలకుండా ధైర్యంగా తాము... తమతో పాటు ఇంకొందరు అన్నట్టుగా కూడకట్టుకుని, కూడబలుక్కుని ముందుకే సాగారు. కూటమిపక్షాన మూడు పార్టీల కలయికను అర్థం చేసుకుని, ఎక్కడా వివాదాలకు తావులేకుండా గెలుపే లక్ష్యంగా ముందడుగు వేశారు. ఆఖరికి మహిళా నేతలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కేసులకు భయపడి కొందరు నియోజకవర్గాలను వీడి పారిపోతే అలవోకగా కూటమి బలహీన పడుతుందని వైసీపీ వేసిన ఎత్తుగడ చివరకు చెల్లలేదు సరికదా ఆ పార్టీకే ఘోరపరాజయాన్ని మిగిల్చింది. దీనిని అంతటిని కూటమి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరైతే పార్టీల అభ్యర్థుల గెలుపుకోసం కష్టించి పనిచేశారో, దీర్ఘకాలికంగా వారు చేసిన సేవలు, నడవడిక, త్యాగాలు అన్నింటిని నివేదిక రూపంలో రప్పించుకుంటున్నారు. తమ ప్రభుత్వం వస్తే చాలనుకుని మరికొందరు ఆర్థికంగా కూడా కూటమికి నైతిక బలం సమకూర్చారు. అటువంటి వారిని ఎక్కడా వదులుకోకుండా సమయం ఇచ్చినప్పుడు వారికి తగిన గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రత్యక్షంగా కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉన్నందున ఈ మూడుపార్టీల్లో ముఖ్యనేతలతో పాటు గెలుపుకోసం విరామం లేకుండా పనిచేసిన మరికొందరు క్యాడర్‌ను కూడా వీలైనన్ని నామినేటెడ్ పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. ఇప్పటికే పలు కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా నామినేటెడ్ కొలువుల్లో ఉన్న కొందరు వైసీపీపక్ష నేతలు ఇంకా ఆ కుర్చీని వీడలేదు సరికదా వీడినట్టు పైకి చెప్తున్నా రాజీనామా మాత్రం సమర్పించనే లేదు. రాష్ట్రప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఇప్పటిదాకా ఉన్నవారంతా తక్షణం వైదొలగాలని అల్టిమేటం జారీచేసింది.

ఇంకా పదవుల్లోనే వైసీపీ నేతలు..



ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ కమిటీల్లో అత్యధిక భాగం కమిటీలు ఇంకా పదవికి అంటిపెట్టుకునే ఉన్నాయి. నియోజకవర్గ నేతల్లో సీనియర్లు, ప్రస్తుత సిట్టింగ్‌లకు అత్యంత సన్నిహితులు ఈ పదవులపై ఆశపెట్టుకుని ఉన్నారు. మార్కెట్ కమిటీలు లన్నీ రాజీనామా చేయని పక్షంలో వాటన్నింటిని రద్దుపరిచి తిరిగి కూటమిపక్షాన కొందర్ని నామినేటెడ్ చేసే దిశగా ప్రభుత్వం కొత్తగా యోచిస్తున్నట్లు చెబుతున్నారు. డీసీసీబీ, డీసీఎంఎస్‌లో డైరెక్టర్లుగా ఏలూరుకు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. అసలు కమిటీలు పూర్తిగా రద్దుచేసిన తరువాత ఎవర్ని నియమించాలి, అనే దానిపై స్పష్టత రానుంది. ఇప్పటికే జిల్లా గ్రంథాలయ సంస్థతో సహా వివిధ కార్పొరేషన్ల అధ్యక్ష, డైరెక్టర్ పదవులను భర్తీ చేయాల్సిందే. జిల్లా పరిధిలో ఇప్పటికే రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన నేత ఉన్నారు. పలు సహకార సంఘాల్లో త్రిసభ్యకమిటీ సభ్యులుగా వైసీపీ అనుకూలురే ఇంకా కొనసాగుతున్నారు. కొందరు ఓడిన వెంటనే రాజీనామా చేయాలన్న సంస్కృతికి తలొగ్గి తమ పదవి నుంచి తప్పుకున్న ఇంకొందరు మాత్రం యథావిధిగా కొనసాగుతూనే ఉన్నారు. వీరి వ్యవహారశైలిలో ప్రభుత్వం తుదినిర్ణయం తీసుకోబోతోంది.

సీనియర్లకు అవకాశం..

జిల్లాలో కూటమి పక్షాన ఉన్న పార్టీల్లో కీలకంగా వ్యవహరించిన ముఖ్యనేతలు అందరికి ఈసారి నామినేటెడ్ పోస్టులు దక్కే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఉంగుటూరు నుంచి పోటీ చేయాలని భావించారు. ఈ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిం చారు. ఈమేరకు ఆయనకు కీలకమైన పోస్టులో త్వరలోనే నియమించబో తున్నారు. ఏలూరు జిల్లాలో టిక్కెట్ ఆశించి చివరి వరకు కష్టపడిన జనసేన నేత రెడ్డి అప్పలనాయుడికి తగు గౌరవప్రదమైన పోస్టులో నియమించాలని భావిస్తున్నారు. ఏదైనా కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా ఆయన నియామకం జరిగే అవకాశం లేకపోలేదు. చింతలపూడిలో కూటమి పక్షాన కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, టీడీపీ సీనియర్ నేత ముత్తారెడ్డి, రామ్‌కుమార్, మండవ లక్ష్మణరావు, ముస్తఫా, దత్తాత్రేయతో పాటు మరికొందరు సీనియర్లకు ఈసారి అవకాశం దక్కే పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో కష్టపడిన వారందరి జాబితాను ఇప్పటికే ఏకపక్షంగా సిద్ధం చేస్తున్నారు. ఇదంతా ఈనెలాఖరులోపు కొలిక్కి రానుంది.

- నూజివీడులో కాపా శ్రీనుతో పాటు మరికొందరికి నామినేటెడ్ పోస్టులు దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పోలవరం నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్ ఆశించి ఐదేళ్ళపాటు నిర్విరామంగా పనిచేసి చివరికి జనసేనకు ఆ నియోజకవర్గం కేటాయించడంతో త్యాగాలకు ఓర్చిన బొరగం శ్రీనివాస్‌కు పార్టీ ప్రాధాన్యత ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించింది. ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులతో పాటు మరికొందరు టీడీపీ, బీజేపీ నేతలకు నామినేటెడ్ పదవులు దక్కే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేకించి టీడీపీ, బీజేపీ, జనసేనలో ఉన్న మహిళా నేతల్లో డజను మందికి పైగానే నామినేటెడ్ ఛాన్స్ దక్కబోతోంది.
- దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎవరికి సూచిస్తే వారికే కీలక పదవుల్లో నామినేటెడ్ చేయబోతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా బీజేపీకి చెందిన డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉండడంతో ఇక్కడ జనసేన, టీడీపీలో సీనియర్లకు పదవులు దక్కనున్నాయి. వీటన్నింటిపైన కొందరితో ఇప్పటికే ఆయా పార్టీల నేతలు సంభాషించారనే చెప్తున్నారు.
- ఏలూరు జిల్లాలో మంత్రిగా కొలుసు పార్థసారథి ఒక్కడే ఉండటంతో ఈలోపు ఇన్‌చార్జి మంత్రి నియామకం జరిగితే వారిద్దరు సూచనల మేరకు కూడా మరికొందరికి అవకాశం లభించవచ్చనే అంచనా వేస్తున్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌తో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ నిర్ణయాలు కూడా పరిగణనలోకి తీసుకోబోతున్నారు. వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కూడా ఇదే జిల్లాకు మరోసారి వరించనుంది. ఎందుకంటే ఏలూరుజిల్లాలో అత్యధిక భాగం కొల్లేరు ఉండడంతో ఈ మేరకు త్వరలోనే నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్నారు. రాష్ట్రస్థాయి పదవుల్లోనూ ఏలూరు జిల్లా నుంచి అరడజను మందికి తగ్గకుండా అవకాశం ఉంటుందని ఇప్పటికే అంచనా వేస్తున్నారు.

అయితే మాకేంటి



ఐదేళ్లపాటు చేసిన ఏకపక్ష విధానాలు, కక్షపూరితంగా సాగిన పాలన, సరిపోలేదు అనుకుంటున్నారో ఏమో, ఇప్పటికే పలు నామినేటెడ్ పోస్టుల్లో వైసీపీ హయాంలో నియమితులైన అనేకమంది తప్పుకోకపోగా ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వెలువడినప్పటికి తామంతా అతీతులమన్నట్లుగా వైసీపీ నేతల ధోరణి ఉంది. అధికారులకు మాత్రం విధిగా తప్పుకోవాల్సిందేనని ఆయా కమిటీల్లో ఉన్న ఛైర్మన్‌లు, సభ్యులకు, డైరెక్టర్లకు సర్దిచెప్పుకున్నా కొందరు మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వమే తమను తొలగించాలని ఇంకొందరు వితండ వాదానికి దిగుతున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్రప్రభుత్వం నామినేటెడ్ పదవులు అన్నింటిని రద్దుచేసి త్వరలోనే కీలక ప్రకటన జారీ చేసే అవకాశం ఉంది.

నీట్-యూజీ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

» పీడీఎస్‌యూ నాయకుల ర్యాలీ, ధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 25 : ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నీట్-యూజీ పరీక్షను రద్దు చేయాలని పీడీఎస్‌యూ సంఘ జిల్లా అధ్యక్షుడు కె. నాని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జడ్పీ కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ, ధర్నా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంపై ప్రధాని మోదీ ఇంతవరకు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. ఎన్‌టీఏ నిర్వహించిన నీట్-యూజీ పరీక్షలో విద్యార్థులకు తెలియకుండానే పలువురికి గ్రేస్ మార్కులు కలపడంవల్లే గందరగోళానికి దారితీసిందన్నారు. ఇంత వివాదం జరిగన తర్వాత ఇప్పుడు గ్రేస్‌మార్కులను తీసివేస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించడం ఏ పద్ధతిని అనుసరించి చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణకు ఎటువంటి రాజకీయజోక్యం లేని వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం ఒక్కొక్కటి రూ.30లక్షలకు అమ్ముకున్నామని దోషులు అంగీకరించినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు లేకపోగా, నీట్ కౌన్సెలింగ్ యథాతథంగా జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో లక్షలాదిమంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్ళీ నిర్వహించాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు క్రాంతి, చందన్, యశ్వంత్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో పీడీఎస్‌యూ నాయకుల ధర్నా

అడ్మిషన్లకు ఇంటింటికీ తిరుగుతా

» ప్రైవేటు స్కూళ్లలో అధిక ప్రవేశాలపై డీఈవో అబ్రహం ఆరా



ఎంఈవోలతో సమీక్షిస్తున్న డీఈవో అబ్రహం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 25 : జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గత ఏడాదికంటే ఈ విద్యా సంవత్సరంలో నూతన అడ్మిషన్లు తీసుకునే విద్యార్థుల సంఖ్య సగానికంటే పడిపోవడంపై డీఈవో అబ్రహం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు అవసరమైతే తానే ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు పెంచేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. మంగళవారం ఏలూరులోని తన చాంబరులో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎంఈవోల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు అమ్మ ఒడి/తల్లికి వందనం నగదు సాయాన్ని వర్తింపజేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గడానికి ఓ కారణమని కొందరు ఎంఈవోలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు 90 రోజులపాటు చేపట్టిన విద్యా ప్రవేశాలు కార్యాచరణను ఐసీడీఎస్, ఎస్‌ఎస్‌ఏ తదితర శాఖలను సమన్వయపరుచుకుని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ వున్నప్పటికీ ఏ ఒక్క పాఠశాలను మూసివేయబోమని, అటువంటి పాఠశాలల వివరాలు తనకు ఇస్తే సంబంధిత గ్రామంలో తానే స్వయంగా ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు తీసుకువస్తానని ప్రకటించారు. ఎంఈవోలందరూ రోజువారీ పాఠశాలల తనిఖీలకు వెళ్ళడంతోపాటు, అదేరోజు సాయంత్రానికల్లా నివేదికలను తనకు పంపాలని కోరారు. స్టూడెంట్ కిట్‌లు మరో 25 శాతం మాత్రమే జిల్లాకు రావాల్సి ఉందని, త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, షరీఫ్, సమగ్రశిక్ష ఏపీసీ, సెక్టోరల్ అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దస్తావేజు లేఖర్లు

ఈ-స్టాంప్ విధానాన్ని రద్దు చేయాలి

ఏలూరు కలెక్టరేట్, జూన్ 25: గత వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో అనేక ఇబ్బందులు ఎదురు అయ్యాయని, ఈ-స్టాంప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేశారు. ఏలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. గత ఏడాది స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖలో ఈ-స్టాంప్ విధానాన్ని అమల్లోకి తెచ్చిందని, గతంలో దస్తావేజులను వెండర్ల ద్వారా విక్రయాలు జరిపేవారన్నారు. వీటిలో 10, 20, 50, 100 రూపాయల విలువైన దస్తావేజులు లభించేవన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ విధానాన్ని తీసుకురావడంతో దస్తావేజులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో ఈ-స్టాంప్ విధానాన్ని రద్దు చేసి పాత నాన్ జ్యుడీషియల్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లింగిశెట్టి సత్యవాణిశ్రీ, వై.కేదారేశ్వరరావు, తుమ్మల కృష్ణారావు, లింగిశెట్టి శశికు మార్, రెడ్డి సునీత, కృష్ణ, కనకదుర్గాదేవి, మద్దాల రాజేశ్వరి, కోలా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేకు 'ఎగ్జిట్-ఎంట్రీ' పాయింట్



వేంసూరు వద్ద నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్

చాట్రాయి, జూన్ 25 : సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో.. చాట్రాయి మండలానికి సమీపంలోని తెలంగాణ పరిధిలో వేంసూరు వద్ద ఎగ్జిట్-ఎంట్రీ పాయింట్ల నిర్మాణం జరుగుతోంది. దీనిపై నూజివీడు, తిరువూరు నియోజకవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి హైదరాబాద్, వైజాగ్, రాజమహేంద్రవరం, అన్నవరం, సింహాచలం వెళ్ళేవారు వేంసూరు వద్ద గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఎక్కితే ప్రయాణ రాకపోకలు సులువవుతాయి. గతంలో ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారికి ఎగ్జిట్-ఎంట్రీలు ఇవ్వాలని సత్తుపల్లి ప్రాంత వాసులు ఆందోళనలు చేశారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో వేంసూరు వద్ద ఇవి మంజూరయ్యాయి. ఎన్‌హెచ్ అధికారి తేజ మాట్లాడుతూ వేంసూరు వద్ద ఈ పనులు జరుగుతున్నాయని, త్వరలో వీటికి అనుసంధానంగా సర్వీస్ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ పూర్తయ్యి, వేంసూరు వద్ద ఎగ్జిట్-ఎంట్రీ ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగుతాయని జనార్దనవరానికి చెందిన కలకొండ భాస్కరరావు చెప్పారు.

ఫిట్‌లెస్..బస్సులే దిక్కు!

» కాలంచెల్లిన ఆర్టీసీ బస్సులతో అగచాట్లు
» ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
» కొత్త ప్రభుత్వం పైనే ప్రయాణికులు, ఉద్యోగుల ఆశలు

ఏలూరు రూరల్, జూన్ 25: మొరాయిస్తూ ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని బస్సులు. ఫిట్‌నెస్ లోపించిన సర్వీసులు, గుంతల రోడ్డులో పడి టైర్లు ఊడిపోయే రథచక్రాలతో ఆర్టీసీ ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఒకప్పుడు సురక్షిత ప్రయాణం అంటే ఆర్టీసీ, అయితే ప్రస్తుతం దానికి భిన్నంగా ఆర్టీసీ ప్రయాణం అంటేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. ప్రభుత్వంలో విలీనం తర్వాత మరింత అధ్వానంగా మారింది. కొత్త కూటమి ప్రభుత్వం రావడంతో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు కొత్త ఆశలు పెట్టుకున్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వహయాంలో కాలం చెల్లిన బస్సులు, గుంతలమయమైన రోడ్ల పై ప్రయాణం సాగిం చాయి. ప్రతిరోజూ విజయవాడ రీజనల్ కార్యాలయ పరిధిలో నాలుగున్నర లక్షల కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్ళల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయి. రోడ్లపై ప్రయాణించా లంటేనే బస్సులు అన్ని షెడ్డు దారి పట్టాయి. తాత్కా లిక మరమ్మ తులతో వాటిని తిరిగి రోడ్ల మీదకు తెచ్చి అధికారులు సరిపెట్టు కున్నారు. గడిచిన రెండేళ్ళల్లో వైసీపీ కార్యకలాపా లకు ఆర్టీసీ బస్సులను ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. జగన్ మీటిం గ్‌ల సందర్భంగా ఫిట్‌నెస్ లేని బస్సులనే 100 కిలోమీటర్ల దూరం లో ఉన్న ప్రాంతా లకు కూడా తరలిం చుకు పోయారు. ఈ క్రమంలో బస్సులు మరింత ఘోరంగా దెబ్బతిన్నాయి. పట్టుమని పది కిలోమీటర్లు కూడా ఏ ఆటంకం లేకుండా బస్సులు నడుస్తాయన్న నమ్మకం లేని పరిస్థితి.



వట్లూరు వద్ద ఆగిపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు (ఫైల్)

296 రూట్‌లు.. 360 బస్సులు..

ఏలూరు జిల్లాలో సగానికి సగం బస్సులు పాత పడిపోయి ఉండడంతో కొత్త బస్సుల కోసం అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో హైయ్యర్ బస్సులతో కలిపి 360 బస్సులు ఉండగా, 296 రూట్‌లలో ప్రతిరోజూ ప్రయాణం సాగిస్తున్నాయి. 80 వేల మంది ప్రయాణికులను ప్రతిరోజూ వారి గమ్యస్థానాన్ని చేరుస్తున్నాయి. అయితే ఇందులో సగానికి సగం బస్సులు డొక్కు బస్సులు ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడంతో వీటిస్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఇటీవల ఆగిపోయిన బస్సు

స్పేర్‌పార్ట్‌లకు తప్పని తిప్పలు

టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో స్పేర్‌పార్ట్‌లు, పనిముట్లు, ఆర్టీసీ సిద్ధంగా ఉంచుకునేది. మెకానిక్‌ల అవసరాల కోసం కొంత నిధిని కార్పొరేషన్ ముందుగానే కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్టీసీ విలీనం తర్వాత ప్రతి చిన్న అవసరానికి అధికారులు ప్రభుత్వం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టైర్లు, స్ప్రింగ్‌లు, ఇతర స్ప్రేర్‌పార్ట్‌లు లేని పరిస్థితి చాలా డిపోల్లో కనిపిస్తోంది. పాత బస్సుల నుంచి స్పేర్‌పార్ట్‌లు వేరు చేయడం, రెండు బస్సులు షెడ్డుకు వస్తే ఒక దాన్నితీసి ఇంకోదానికి వేసి బస్సును సిద్ధం చేసేవారు. ఫలితంగా సర్వీసుల సంఖ్య తగ్గిందని ఉద్యోగులు చెబుతున్నారు. డొక్కు బస్సులు అన్ని పక్కకు పెట్టి అధికారులు మైలేజ్ పెంచాలని ఒత్తిడి తెచ్చేవారు. కాగా ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం కష్టాలు కొంతఅయినా తీరుతాయని ఉద్యోగులు, అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 26 జూన్ 2024

హెల్తీ డ్రింక్

ఈ టీలతో ఆరోగ్య రక్ష

హెర్బల్ టీతో మనసుకు, శరీరానికి సాంత్వన చేకూరడంతో పాటు కొన్ని రుగ్మతలు కూడా అదుపులోకొస్తాయి. కాబట్టి రుగ్మతకు తగిన టీని ఎంచుకుని, తరచూ తాగుతూ ఉండాలి.

బ్లాక్ టీ

- మధుమేహంతో పాటు హృద్రోగాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి.
- రక్తంలో చక్కెర స్థాయులు స్థిరంగా ఉంటాయి.
- వాపులు తగ్గిస్తుంది.

గ్రీన్ టీ

- దీన్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- కణాలు ఆరోగ్యంగా పెరగటానికి దోహదపడుతుంది.
- సాంత్వన చేకూరుస్తుంది.

పెప్పర్‌మింట్

- కఫం బయటికొచ్చేలా చేస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులు తగ్గించేదిగా) పని చేస్తుంది.
- ఆకలిని తగ్గిస్తుంది.

శొంఠి టీ

- అలర్జీలను తగ్గిస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పని చేస్తుంది.
- ప్రయాణాల్లో తలెత్తే మోషన్ సిక్‌నెస్‌ను నివారిస్తుంది.
- రుచిని పెంచుతుంది.

దాల్చిన చెక్కటీ

- కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- వైరస్‌లతో పోరాడుతుంది.
- ఆర్థరైటిస్ లక్షణాలను పారదోలుతుంది.



పేరెంటింగ్

హోమ్‌వర్క్ ఇష్టంగా...

పిల్లలతో హోమ్‌వర్క్ చేయించటానికి తల్లితండ్రులు సతమతమయిపోతూ ఉంటారు. దగ్గరుండి చేయించలేక, ఆ వర్క్ తామే పూర్తి చేసి హమ్మయ్య... అని ఊపిరి పీల్చుకుంటూ ఉంటారు. ఇలా కాకుండా తమంతట తాము పిల్లలే ఇష్టంగా హోమ్‌వర్క్ చేసుకుపోయేలా చేయగల చిట్కాలున్నాయి. అవేంటంటే...

- రోజూ స్కూలు నుంచి ఇంటికి రాగానే హోమ్‌వర్క్ చేయమని బలవంత పెట్టకుండా గంటపాటు పిల్లలని ఆటలాడనివ్వాలి.
- ఆటల తార్వత స్నానం చేయించి, హోమ్‌వర్క్ చేయమని పురమాయిస్తే కొత్త ఉత్సాహంతో ఇష్టంగా చేస్తారు.
- కొందరు పిల్లలకి ఇంట్లో చదవటం, రాయటం నచ్చదు. ఇంట్లో ఉన్నంతసేపు తమకిష్టమైనట్టు ఉండాలని ప్రయత్నిస్తారు. ఇలాంటి పిల్లలకు హోమ్‌వర్క్ చేయమని చెబితే విసుగ్గా చూస్తారు. ఈరోజు స్కూల్లో ఏం చెప్పారు? ఏం రాయించారు? ఆ టీచర్ ఏం చెప్పింది? అని మాటల్లో పెట్టి పుస్తకాలు తీయించాలి.
- అవసరమైతే దగ్గరుండి అనుమానాలను నివృత్తి చేయాలి.
- ఒకసారి సహాయం చేసినా, రెండోసారి వాళ్లంతట వాళ్లే హోమ్‌వర్క్ పూర్తి చేసేలా చూడాలి.
- ప్రతి రోజూ హోమ్‌వర్క్‌కు ఓ సమయాన్ని, స్థలాన్ని కేటాయించి దాన్నే ప్రతిరోజూ అనుసరించేలా చేయాలి.
- ఎప్పుడైనా పిల్లలు హోమ్‌వర్క్ చేయటానికి నిరాకరిస్తే కారణం అడిగి తెలుసుకుని అందుకు తగ్గట్టు స్పందించాలి.
- హోమ్‌వర్క్ చేయటం కూడా ఆటల్లో భాగంగా పిల్లలు ఇష్టంగా చేసే వాతావరణాన్ని కల్పించాలి.



ఫ్యాషన్



గంజి పట్టించి, ఇస్త్రీ చేయనిదే కాటన్ చీరలను కట్టుకోలేం అనుకునే రోజులు పోయాయి. పైగా కాటన్ చీరలు వేసవికే పరిమితమనే భావన కూడా అంతరించింది. అన్ని చీరల్లాగే నచ్చినప్పుడు కట్టుకునేలా ఇప్పుడెన్నో రకాల కాటన్ చీరలు అందుబాటులోకొచ్చాయి. వాటిలో చెప్పుకోదగినవి 'గబ్రు' చీరలు. వాటినొకసారి చూసేద్దామా!

'గబ్రు'లో గమ్మత్తుగా..

హ్యాండ్ ప్రింట్ గబ్రు కాటన్ చీరల మూలాలు రాజస్థాన్‌లో ఉన్నాయి. ఈ సంప్రదాయ రాజస్థానీ పద్ధతి తరతరాలుగా మహిళలను అలరిస్తూనే ఉంది. సహజసిద్ధ రంగులతో ఆకట్టుకునే డిజైన్లను అద్దే ఈ గబ్రు కళ నేటికీ ప్రపంచవ్యాప్త పర్యాటకులను ఆకర్షిస్తూనే ఉంది. గబ్రు హ్యాండ్ ప్రింట్ కాటన్‌లో మెటీరియల్స్, చీరలు రెండింటికీ మంచి ఆదరణ ఉంది. వెలసిపోని రంగులు, డిజైన్లను కలిగి ఉండే గబ్రు చీరలు సాదాసీదా కాటన్ చీరల్లా నాలుగైదు ఉతుకులకే వెలసిపోయి, చీకిపోకుండా ఎక్కువ కాలం మన్నడం వల్ల కూడా మహిళలు వీటిని క్యాజువల్ వేర్‌గా ఎంచుకుంటూ ఉంటారు.

సొగసులీనుతూ...

గబ్రు చీరల్లో రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం కోసం కొన్ని ఫ్యాషన్ చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

- సింపుల్‌గా, హుందాగా కనిపించాలంటే, తేలిక రంగులు, చిన్న డిజైన్లు, సన్నని బార్డర్లు కలిగి ఉండే బగ్రు చీరలనే ఎంచుకోవాలి. ఇలాంటి చీరలు ఆఫీస్ వేర్‌గా కూడా చాలా బాగుంటాయి.
- స్నేహితులతో సరదాగా షికారుకు బయల్దేరేటప్పుడు ముదురు ఎరుపు, నీలం, పసుపు కాంట్రాస్ట్ చీరలు బాగుంటాయి. ఫ్యాషన్‌గా కనిపించడం కోసం పొట్టి చేతులు, కాలర్ కలిగిన బ్లౌజ్‌లు లేదంటే స్లీవ్‌లెస్ బ్లౌజులు ఎంచుకోవాలి.
- ఫ్యామిలీ గెట్ టు గెదర్స్‌లో నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే, సింపుల్ జ్యువెలరీతో చీరను మ్యాచ్ చేయాలి.
- మెత్తగా, హాయిగొలిపే గబ్రు చీరల అందమంతా వాటి మీది అద్దకంలోనే ఉంటుంది. రంగులు, ప్రింట్లు వెలసిపోకుండా ఉండడం కోసం వీటిని నీడ పట్టునే ఆరేస్తూ ఉండాలి. తక్కువ వేడి మీద ఇస్త్రీ చేయించుకోవాలి.



బొప్పాయితో అందంగా...

బొప్పాయి తింటే చక్కటి ఆరోగ్యం కలుగుతుంది. ఇదే బొప్పాయి గుజ్జు జుట్టుకే కాదు.. చర్మ సౌందర్యానికీ మేలు చేస్తుంది. బొప్పాయితో ఇలా సులువుగా ఫేస్‌ప్యాక్స్ చేసుకోవచ్చు...

- బౌల్‌లో పావు కప్పు బొప్పాయి గుజ్జును తీసుకుని ఇందులో రెండు టేబుల్ స్పూన్ల తేనె, స్పూన్ తులసి పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే మృతకణాలు తొలగిపోతాయి. అంతేకాకుండా మొటిమలు తగ్గిపోతాయి.
- రెండు టేబుళ్ల బొప్పాయి చూర్ణంలోకి అరటీస్పూన్ పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పటిస్తే పిగ్మెంటేషన్ పోతుంది. ముఖం మీద ఉండే నొప్పులు పోతాయి. యూత్‌ఫుల్‌గా కనిపిస్తారు.



- ఇంట్లో బొప్పాయి తప్ప ఏమీ లేకపోతే.. బొప్పాయి చూర్ణాన్ని చర్మంమీద పట్టించాలి. ముప్పయి నిముషాల తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల అందులోని ఎ, సి విటమిన్ల వల్ల చర్మంలో డీప్ క్లీనింగ్ జరుగుతుంది. చర్మం మిలమిలా మెరుస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల బొప్పాయి గుజ్జును, రెండు టేబుల్ స్పూన్ల అరటిగుజ్జు కలిపి ముఖానికి, మెడ చివర వరకూ పట్టించాలి. ఇలా తరచుగా చేస్తుంటే చర్మం మృదువుగా ఉంటుంది.
- రెండు టేబుల్ స్పూన్ల బొప్పాయి పేస్టులో అరటీస్పూన్ కొబ్బరి నూనె వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మం మీద మంటలు తగ్గుతాయి.
- బౌల్‌లో తెల్లసొన వేసి ఇందులోకి రెండు చెంచాల బొప్పాయి పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే చర్మం మీద ముడతలు కనపడవు.
- జిడ్డు చర్మం లేదా ఆయిలీ స్కిన్ ఉంటే నిద్రపోయే ముందు రెండు స్పూన్ల బొప్పాయి గుజ్జు, రెండు స్పూన్ల పెరుగు తీసుకుని కలిపాక.. ముఖానికి పట్టించుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రం చేసుకోవాలి.

మా బతుకు

మమ్మల్ని బతకనిస్తే చాలు

ట్రాన్స్ మహిళల పట్ల సమాజంలో పాతుకుపోయిన రకరకాల అపోహలకు, దురాభిప్రాయాలకు దీటైన సమాధానం సుబ్బలక్ష్మీ రెడ్డి జీవితం. హైదరాబాద్‌లోని 'కాదంబరి స్టూడియోస్' బోటిక్ యజమానురాలిగా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించారు. ఆమె డిజైన్ చేసిన వస్త్రాలకు సామాన్యుల మొదలు సెలబ్రిటీల వరకు... ఎంతో మంది అభిమానులున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తన అనుభవాలను, జీవిత విశేషాలను 'నవ్య'తో పంచుకున్నారు.



"మా కాదంబరీ స్టూడియోస్ బోటిక్‌లో యాభైమందికిపైగా ఉద్యోగులున్నారు. దాని టర్నోవర్ ఏడాదికి నాలుగు కోట్ల రూపాయలు. ప్రతినెలా పదిలక్షల రూపాయల వరకు జీతభత్యాలు చెల్లిస్తాను. లంగా-ఓణీ లాంటి సంప్రదాయ వస్త్రాలను కస్టమర్ల అభిరుచికి తగినట్టుగా సరికొత్తగా డిజైన్ చేయడం మా ప్రత్యేకత. అదీ బడ్జెట్‌లో. అందుకే ఇక్కడి సినిమా, సీరియల్ నటీమణులతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాల్లోని తెలుగువారి నుంచి మాకు ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. మా దగ్గర నుంచి విదేశాలకు వెళ్లే పార్శిల్స్ రోజుకు పదికి తక్కువ ఉండవు. పెళ్లిళ్లు, సీమంతం, పుట్టినరోజు లాంటి వేడుకలు, శుభకార్యాలకు తగినట్టుగా పెన్‌కలంకారీ దుస్తులు, లెహంగాస్, అనార్కలీ సల్వార్ సూట్స్, లాంగ్ ఫ్రాక్‌లు రూపొందిస్తాం. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ చేసిన రకరకాల డిజైన్లలో వస్త్రాలు అందిస్తాం. కాబట్టి మా 'కాదంబరి'ని చాలామంది ఇష్టపడతారు. పెళ్లికుమారుడి సంప్రదాయ దుస్తులు సైతం మా బోటిక్‌లో ఉంటాయి. ఒక డ్రస్సు కుట్టేముందు దాని కలర్ కాంబినేషన్ దగ్గర నుంచి డిజైనింగ్ వరకు... ప్రతిదీ నేనే దగ్గరుండి చూసుకుంటాను. అలా ఇప్పటివరకు కొన్నివందల వెరైటీలు డిజైన్ చేసి ఉంటాను. అవి ఫ్యాషన్ వస్త్ర వ్యాపార సముదాయంలో మాకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఇదంతా నాకు నేనుగా సాధించిందే అయినా, ఒక్కరోజులో సాధ్యపడలేదు. నా కఠోర శ్రమ, సృజనాత్మకతతో పాటు మా ఉద్యోగుల తోడ్పాటు వల్ల అతి చిన్న బోటిక్‌తో ప్రారంభమైన మా వ్యాపారం ఆరేళ్లలో ఒక పరిశ్రమ స్థాయికి ఎదిగింది.

అది పెద్ద పరీక్షా సమయం...

నేను అబ్బాయిగా పుట్టినా... నాది కాని శరీరంలో నేనున్నానన్న బాధ నన్ను కుదురుగా ఉండనివ్వలేదు. నా లైంగికతకు, సమాజం నన్ను చూస్తున్న తీరుకు మధ్య సంఘర్షణలో నలిగిపోతూ మాటల్లో చెప్పలేనంత మనోవ్యధను అనుభవించాను. ట్రాన్స్‌గా మారే వరకు ఒక రకంగా నరకాన్ని చూశాను. బహుశా... ఇది నాలాంటి వారందరి జీవితానుభవం కూడా కావచ్చు. మాదొక మధ్య తరగతి కుటుంబం. నాన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. అమ్మ ఇంట్లోనే కుట్టు పని చేసేది. నాకు అక్క, అన్నయ్య ఉన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ చదవాలన్నది చిన్నప్పటి నుంచి నా కోరిక. కానీ ఆర్థిక పరిస్థితి అనుకూలించక.. పెద్దల ఒత్తిడితో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సరిగ్గా అదే సమయంలో నా అస్తిత్వం బహిర్గతమైంది. నాదైన రూపం మా కుటుంబం కంట పడింది. దాన్ని చూసి వాళ్లు భరించలేకపోయారు. నా అభిమతాన్ని నిరాకరించారు. దాంతో నాకు ఇష్టమైనట్టు బతకడం కోసం ఇంట్లో నుంచి బయటకు వచ్చాను. నిజానికి అది నాకొక పెద్ద పరీక్షా సమయం.

సుబ్బలక్ష్మిగా మారిన తర్వాత...

ట్రాన్స్‌గా మారతానన్నప్పుడు నన్ను ఎంతగానో ప్రేమించే మా అక్క కూడా అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ట్రాన్స్ మహిళలు అనగానే సెక్స్‌వర్క్ లేదంటే యాచకవృత్తి చేసుకొని బతికేవాళ్లనేది మా కుటుంబ సభ్యుల అభిప్రాయం. నేనలా కానని అన్నాను. "సమాజం వాళ్లను అలానే చూస్తుంది కదా" అన్నారు. అప్పుడు నన్ను నేను నిరూపించుకోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. శారీరకంగా ట్రాన్స్‌గా మారడాన్ని కొద్దిరోజులు వాయిదా వేసి, ఒక ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. ఏడాది వరకు ఉద్యోగంలో చేసి, ఆ జీతంలో మిగిలించుకున్న కొద్దిపాటి డబ్బుతో 2018లో బోటిక్ ప్రారంభించాను. కొన్నాళ్ళకే వ్యాపారం వృద్ధి కావడంతో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఒకరోజు మా సిబ్బందిని పిలిచి... "ఇప్పటి వరకు మీరు చూస్తున్న నేను ఒక అబద్ధం. ఇకమీదట నాదైన రూపంలోకి మారుతున్నాను. మీకేమైనా అభ్యంతరాలున్నాయా?" అని అడిగాను. "మేము మీ సంస్థలో పనిచేస్తున్నాం, అందుకు తగిన జీతం మాకు ఇస్తున్నారు. అంతకుమించి మీ లైంగికతతో, మీ జెండర్‌తో మాకు పనిలేదు. మాకెలాంటి అభ్యంతరం లేదు"అని వారంతా చెప్పారు. ఒక పెద్దాయన "ఇన్నాళ్లు నీలో నా కొడుకును చూసుకున్నాను, ఇకమీదట నువ్వు నా కూతురు అనుకుంటాను" అన్నారు. అదే ప్రశ్న మా ఇంటి ఓనర్‌ను కూడా అడిగాను. ఆమె నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకొని, మరింత ధైర్యాన్ని ఇచ్చారు. సుబ్బలక్ష్మిగా మారిన నాకు ఎన్నడూ సమాజం నుంచి అవమానాలు, ఛీత్కారాలు ఎదురుకాలేదు. ఇదివరకు "అన్నా" అని పిలిచిన వారు ఇప్పుడు 'అక్కా" అని పిలుస్తున్నారు. "సర్" అని సంబోధించేవారు కాస్తా "మేడమ్" అంటున్నారు. మా కస్టమర్లు కూడా నా లైంగికతకన్నా నేను రూపొందించిన డిజైన్లకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉంది.

> చిన్నతనంలో ఇంటా, బయటా, బడిలో... ఇలా ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురికాని ట్రాన్స్ మహిళ ఉండదు. ప్రతి ట్రాన్స్ మహిళ టీనేజీలో శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు లోనైన బాధితురాలే.! మా జీవితాల్లోని ఆ పార్శ్వాన్ని పట్టించుకునే వారెవరు? మా బాధకు ఉపశమనం కలిగించే చోటెక్కడుంది? కాలేజీలు, మరీ ముఖ్యంగా అబ్బాయిల హాస్టళ్లలో లైంగికత విభిన్నంగా ఉన్నవారిపై జరిగే హింస మాటలతో చెప్పేది కాదు. ఒకవైపు వేధింపులు, మరోవైపు తామేంటో తమకు తెలియకపోవడం... ఈ మనో వ్యధతో చదువు మీద శ్రద్ధ పెట్టలేక చాలామంది పదో తరగతి, ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు. వారి అస్తిత్వాన్ని కుటుంబం అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి బయటకువస్తున్నారు. బతుకుదెరువు కోసం యాచకవృత్తి లేదంటే సెక్స్‌వర్క్ లాంటివాటిని ఆశ్రయిస్తున్నారు.

అదే నా ప్రత్యేకత...

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చదవని నాకు... దుస్తుల డిజైనింగ్‌లో నాకంటూ ప్రత్యేక గుర్తింపు రావడానికి ప్రధాన కారణం దానిమీద నాకున్న ఆసక్తి మాత్రమే. ఇంట్లో అమ్మ మిషన్ కుట్టడం, క్లాత్ కత్తిరించడం లాంటివి చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను. మా అక్కతో షాపింగ్‌కు వెళ్లినప్పుడు డ్రెస్సుల రంగులు, వాటి మీద డిజైన్లను క్షుణ్ణంగా చూడటం యుక్త వయసులోనే నాకు ఒక వ్యాపకం అయింది. దానికితోడు సినిమాల్లోని కథానాయికల కాస్ట్యూమ్స్‌ను పరిశీలిస్తుండేదాన్ని. బొటిక్ పెట్టాలన్న ఆలోచన నాకు మొదటి నుంచి ఉంది కనుక... ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ లాంటివన్నీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నాను. నాకు మొదటి నుంచి మన సంప్రదాయ వస్త్రాలంటే చాలా ఇష్టం. వాటిని ప్రస్తుత కాలానికి తగినట్టుగా కస్టమర్లు ఇష్టపడేలా డిజైన్ చేయడం మొదలుపెట్టాను. ఒక కొత్తదనాన్ని పరిచయం చేశాను. అది ఇవాళ నన్ను ఈ స్థానంలో నిలబెట్టింది.

కావాల్సింది గౌరవ మర్యాదలు కాదు...

కాదంబరీ స్టూడియోస్ ఫ్రాంఛైజీ ఇవ్వమని చాలామంది అడుగుతున్నారు. వారందరికీ నిర్మొహమాటంగా కుదరదని చెబుతున్నాను. నా వస్త్ర వ్యాపారాన్ని మరింత విస్తరింపచేయాలి. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది నా లక్ష్యం. మా కమ్యూనిటీలో కుట్టుపనిలాంటివి తెలిసినవారు పెద్దగా లేకపోవడంతో ముగ్గురు ట్రాన్స్ మహిళలకు మాత్రమే నా పరిశ్రమలో ఉద్యోగం ఇవ్వగలిగాను. ట్రాన్స్ వ్యక్తులను అర్థంచేసుకొనేంతగా ఈ సమాజం ఎదగలేదు. కనుక వారికి ఉద్యోగాలు ఇవ్వడం చాలా అరుదు. ఒకవేళ అలాంటి అవకాశం వచ్చినా, తోటి ఉద్యోగులు వారిని సరిగ్గా అర్థం చేసుకోవాలి కదా. అందుకే ట్రాన్స్ వ్యక్తులకు ఉద్యోగాలకన్నా ఆత్మగౌరవంతో బతికేందుకు చిన్నదైనా వ్యాపారమే ఉత్తమం. కాబట్టి వారికి జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించడం తక్షణ అవసరం. దీన్ని మనమంతా గుర్తించాలి. ట్రాన్స్ మహిళలుగా మాకు ఈ సమాజం నుంచి ప్రత్యేక గౌరవ మర్యాదలేమీ అక్కర్లేదు, వాటిని ఆశించడం లేదు కూడా. సాటి మనుషుల్లా మా బతుకు మమ్మల్ని బతకనిస్తే చాలు.

• సాంత్వన్

ట్రెండీ టచ్

'అహో'నా స్టైలంటా!



ట్రెండ్‌ను ఫాలో అవదు... అలాగని ట్రెండ్‌ను సెట్ చేయదు. కానీ ఆమెకంటూ ఒక ట్రెండ్ ఉంది. సినిమాల్లో నటిస్తూనే... సామాజిక మాధ్యమాల్లో యమ బిజీగా ఉంటుంది. నచ్చింది చేస్తూ... విభిన్న డ్రెస్సుల్లో ఆకట్టుకొంటూ... ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తుంది. నవతరం ఫ్యాషన్ ఐకాన్‌గా 'ఇన్‌స్టా'ంట్‌గా వేలకు వేలు లైక్‌లు కొట్టేస్తున్న మళయాళ మనోహరి... అహానా కృష్ణ ట్రెండీ టచ్ ఇది.

మళయాళ చిత్ర పరిశ్రమలోనే ప్రధానంగా పని చేస్తున్నా... సామాజిక మాధ్యమాల్లో సరిహద్దులు దాటిన అభిమానం ఉంది అహానా కృష్ణకు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముప్పై లక్షలకు పైగా ఆమెను ఫాలో అవుతున్నారు. యూట్యూబ్‌లో పదిహేను లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ దీనికి అదనం. అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న అహానా... సామాజిక మాధ్యమాల్లో పెట్టే ప్రతి పోస్టుకూ క్షణాల్లో లైక్‌లు లక్ష దాటుతున్నాయి.

పదేళ్ల కిందట పరిశ్రమలో ప్రయాణం మొదలుపెట్టినా... ఇప్పటికి ఆమె నటించిన చిత్రాలు పది దాటలేదు. కానీ స్టార్ హీరోయిన్లకు తీసిపోని ఫాలోయింగ్. అందుకు ముఖ్య కారణం... నెట్టింట ఆకట్టుకొనే ఆమె డ్రెస్సింగ్ స్టయిల్. పాశ్చాత్య వస్త్రధారణలో అహానా లుక్ ఎంతగా అలరిస్తుందో... సంప్రదాయ దుస్తుల్లోనూ అంతే అబ్బుర పరుస్తుంది. రెండిటికీ సమప్రాధాన్యం ఇస్తుంది ఈ నటి. బ్లాక్ లేస్ అవుట్‌ఫిట్‌లో ఫొటోషూట్ చిత్రాలను అహానా ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. గంటల వ్యవధిలోనే ఆ ఫొటోలకు లెక్కకు మించి లైక్‌లు వచ్చాయి. వేలల్లో నెట్టింట చక్కర్లు కొట్టాయి. అంతకుముందు ఆఫ్ షోల్డర్ టాప్, టై హై స్లిట్ ప్యాంట్‌తో మెరిసిన ఫొటోలూ తక్కువేంకాదు. లక్షకు పైగా లైక్‌లు సంపాదించాయి.

మళయాళ నటుడు కృష్ణ కుమార్ నలుగురు కూతుళ్లలో అహానా పెద్దమ్మాయి. అహ్మదాబాద్ 'ముద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్'లో అడ్వర్‌టైజింగ్ మేనేజ్‌మెంట్ అండ్ పబ్లిక్ రిలేషన్స్‌లో పీజీ చదివింది. ఆమె స్వస్థలం కేరళ రాజధాని తిరువనంతపురం. సరిగ్గా పదేళ్ల కిందట తొలిసారి వెండితెర మీద తళుక్కుమంది. కథాబలంతో పాటు ప్రాధాన్యమున్న పాత్రలనే ఎంచుకొంటూ... అడుగులు వేస్తోంది. మాధ్యమం ఏదన్నది ఆమెకు ముఖ్యం కాదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ... తనకు పేరు తెస్తాయనుకున్న కథలను ఓకే చేస్తూ... ఒక విభిన్నమైన కెరీర్‌ను నిర్మించుకుంది. అందులో భాగంగానే వెబ్‌సిరీస్‌లలో నటిస్తోంది. కొన్ని మ్యూజిక్ వీడియోల్లోనూ కనిపించి.. అన్ని వర్గాల అభిమానులకూ చేరువ అయ్యే ప్రయత్నం చేస్తోంది. రెండు మూడు పాటలూ పాడి... తన సంగీత అభిరుచినీ చాటుతోంది.



ఇవన్నీ ఒకటైతే... సామాజిక మాధ్యమాల్లో ఆమె ట్రెండీ టచ్ మరొక ఎత్తు. ఫ్యాషన్‌పై తన ఆసక్తితో పాటు... విభిన్నమైన వస్త్రధారణతో ఫ్యాషన్ ఐకాన్ గానూ వేలమంది మనసు దోచుకొంటోంది. ఇదే ఆమెకు సినిమాలకు మించి గుర్తింపు తెచ్చి పెడుతోంది. డ్రెస్సింగ్‌లోనూ ఆమెకంటూ ఒక అభిరుచి ఉంది. ఎక్కువగా వి-నెక్ టాప్స్, డ్రెస్‌లు ఇష్టపడే ఈ తార... ఆకర్షణీయమైన రంగులు, పాలెట్స్, ప్యాటరన్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. సంప్రదాయ సల్వార్ సూట్ అయినా... వెస్టరన్ అవుట్‌ఫిట్స్ అయినా... ఆమె ధరిస్తే 'ఆహా' అనాల్సిందే. కళ్లు చెదిరే వర్ణాలు, హుందాగా కనిపించే వస్త్రశ్రేణులు, సరికొత్త హంగులతో ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ వెనకాడదు. 'హీరామండీ' స్ఫూర్తితో ఇటీవల ఆమె చేసిన ఓ డిజైన్... నెటిజనులనే కాదు, ఫ్యాషన్ పండితులను కూడా మైమరిపించింది. స్టయిలిష్ జంప్‌సూట్స్, స్వెటర్స్, టీషర్ట్స్, క్యాజువల్ అవుట్‌ఫిట్స్ కలెక్షన్ అహానా వద్ద లెక్కకు మించి ఉన్నాయి. యువత అభిరుచిని, నయా ట్రెండ్‌ను పట్టేయడం, ఏ వెరైటీ అయినా తనకు నప్పేలా మార్చుకోవడం... ఇవే అహానాను స్టైల్ ఐకాన్‌ను చేశాయి.

రేపు దివ్యాంగ నిర్ధారణ శిబిరం

ఉంగుటూరు, జూన్ 25 : నారాయణపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగ నిర్ధారణ, ఉపకరణాల శిబిరం నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన ఆరు నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు, భవిత పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.రాజు సూచించారు.

ఉత్సాహంగా ఈత పోటీలు


ఈతకొడుతున్న క్రీడాకారులు

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 25: ఏలూరు విశ్వనాథబత్యా స్విమ్మింగ్ పూల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఈత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో టి.రఘురామ్, ఎస్కే అఖిల్, ఎ.యశ్వంత్ త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జూనియర్ నేషనల్ పోలో పోటీలకు ఎంపికయ్యారు. వారిని డీఎస్‌డీవో డి.శ్రీనివాసరావు, కోచ్ గణేష్, అసోసియేషన్ సెక్రటరి మల్లిఖార్జున్‌రావు అభినందించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 56 మంది ఎంపిక

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 25 : హైదరాబాద్‌లోని రెడ్డీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగ నియామకాలకు మంగళవారం సీఆర్‌ఆర్ కళాశాలలో జరిగిన క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. 81 మంది విద్యార్థులు హాజరుకాగా 56 మంది అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, కో-ఆర్డినేటర్ రాము, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 25 : రూరల్ మండలం మాదేపల్లి హైస్కూలు, జాలిపూడి యూపీ స్కూళ్లను డీఈవో అబ్రహం మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ కోసం నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమం అమలు తీరు, ప్రగతిపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం రుచి చూశారు. హెచ్‌ఎం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు 15 కుర్చీలు బహూకరణ

ఏలూరు రూరల్, జూన్ 25: ప్రముఖ జ్యూయలర్స్ అధినేత వంగలపూడి ప్రసాద్ వైఎస్సార్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలకు 15 కుర్చీలను ఉపాధ్యాయుడు వంగలపూడి ప్రసాద్‌కు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.జయలక్ష్మి, సీజేపీ స్టీవెన్, పి.లక్ష్మి, కుమారి, జెరీనా, కిరణ్‌కుమారి, 13వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మెరుగుమాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌లో చేరండి

ఉంగుటూరు, జూన్ 25 : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే యూటీఎఫ్‌లో చేరాలని ఉంగుటూరు మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, దాకి జోగి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ కైకరం ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావుతో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గౌరవాధ్యక్షులు శీతాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు శ్రీధర్, కోశాధికారి ఆనంద కుమార్, పుప్పాల నరసింహారావు, బొమ్మిడి ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పారిశుధ్య కార్యక్రమాలు


వసతి గృహాల్లో శానిటేషన్ కార్యక్రమం

లింగపాలెం, జూన్ 25: ధర్మాజిగూడెంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మంగళవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. దోమలు మందు చల్లించారు. విద్యార్థులు దోమ తెరలు వాడాలని చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్ సూచించారు. ఎంపీహెచ్ఎస్ సారథి, పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు విమలాదేవి, ధనలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పెదబాబు పుట్టిన రోజు వేడుకలు


పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమసుందరి, సురేష్

ఏలూరు రూరల్, జూన్ 25: నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెద బాబు పుట్టిన రోజు వేడుకలను మా దేప ల్లి ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో సాయి బాలాజి, అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాది, 36వ డివిజన్ కార్పొరేటర్ బీమవరపు హేమసుందరి సురేష్ పాల్గొని ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పసుపులేటి సందీప్, జి.ఉమామహేశ్వరరావు, పిట్టా కుపేంద్ర, దుర్గారావు, సాయి, బీఎస్‌కే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం

ఏలూరు రూరల్, జూన్ 25: సామాజిక సేవే లక్ష్యంగా రివర్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. 18వ డివిజన్ రాజీవ్ గృహ కల్ప కాలనీలో ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ ఆయన చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. విజయరాజు ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్ చేస్తున్న సేవలను కొనియాడారు. సీనియర్ ఉపాధ్యాయులు స్టీవెన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

ఏలూరు టూ టౌన్, జూన్ 25: పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎం.సాంబశివరావు, ఎం.చిట్టిబాబు మంగళవారం అందజేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా

ఉంగుటూరు, జూన్ 25 : మండలంలోని అప్పారావు పేట గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నేతృత్వంలోని లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొండచిలువ హల్‌చల్

చింతలపూడి, జూన్ 25: స్థానిక కొత్త బస్టాండ్ మెయిన్ రోడ్డు పై 12 అడుగుల కొండచిలువను గత రాత్రి 10 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించారు. పక్కనున్న పొదల్లో నుంచి మెయిన్‌రోడ్డులోని డివైడర్‌ను దాటుకుంటూ వస్తున్న కొండచిలువను కర్రలతో కొట్టి హతం చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణ

ఏలూరు కార్పొరే షన్, జూన్ 25 : స్థానిక అగ్రహారంలోని ఆంజనేయ స్వామి ఆల యం వద్ద మంగళవారం దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన విజయశ్రీ ఉమామ హేశ్వర భక్తిరంజని అధ్య క్షులు బోను ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. హనుమాన్ భక్తి సంకీర్తనలను ఆలపించారు. కోటదిబ్బ వద్ద గల గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలోని అంజనేయస్వామి మందిరం వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు మంగళవారం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. మినీ బైపాస్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహిక అర్చనలు చేసి గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు.

అన్న సమారాధన

ఉంగుటూరు, జూన్ 25 : గ్రామంలోని రామాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు భీమరాజు, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్ బండారు సింధు, ఉప సర్పంచ్ పాతూరి జగదీష్, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కైకరంలోని శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నిలిచిన నాడు-నేడు పనులు

- గత ప్రభుత్వం నిర్లక్ష్యమేనంటున్న తల్లిదండ్రులు
- త్వరగా పూర్తి చేయాలని వినతులు


అసంపూర్తిగా ఉన్న జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల భవనం

జంగారెడ్డిగూడెం, జూన్ 25 : మండలంలో రెండో దశ నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. రివాల్వింగ్ ఫండ్ లేక కొన్ని పనులు ఆగిపోతే ప్రభుత్వం అందించే ఇసుక, సిమెంట్ అందక మరికొన్ని పనులు నిలిచిపోయాయి. దీంతో అదనపు తరగతి గదులు అవసరమైన పాఠశాలలకు తరగతుల నిర్వహణ కష్టతరంగా ఉంది. తరగతి గదుల నిర్మాణం, పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడానికి వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని 2019 నవంబర్ 14న ప్రారంభించింది. మొదట్లో ఉన్న వేగం ఆ తర్వాత ప్రభుత్వం తగ్గిస్తూవచ్చింది. రెండో దశలో పనులు నత్తనడకన నడిచాయి. దీంతో కోట్లాది రూపాయల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం మండలంలో 73 ప్రభుత్వ పాఠశాలలుండగా 2023-24 విద్యా సంవత్సరానికి 7,405 మంది విద్యార్థులున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఇంకా చేరికలు జరుగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఒక కుటుంబంలో ఎంతమంది విద్యా ర్థులు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం పథకంలో భాగంగా రూ.15 వేలు తల్లి ఖాతాలో వేయనున్నట్లు ప్రకటించారు. అందువల్ల పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది. పెరగనున్న విద్యార్థుల సంఖ్యను బట్టి తరగతి గదులు కూడా పెంచవలసిన అవసరం ఉంది. మండలంలో నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించవలసిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని 55 పాఠశాలలకూ 355కు నాడు-నేడు పనులు మంజూరయ్యాయి. ఈ పనుల నిమిత్తం రూ.20 కోట్ల 74 లక్షల 24 వేలు అంచనా వ్యయం కాగా ఇప్పటి వరకు రూ.11 కోట్ల 60 లక్షల పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా రూ.తొమ్మిది కోట్లకు పైగా పనులు జరగవలసి ఉంది. ఇదిలా ఉండగా పాఠశాలకు మంజూరైన పనుల్లో తలుపులు, కిటికీలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్‌లు, నల్ల బల్లలు, బెంచీలు, మంచినీటి సరఫరా మొదలైన వాటిని ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు పంపవలసి ఉంది. భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు కనుక ఇవేవి పాఠశాలకు చేరుకోలేదు. నూతన ప్రభుత్వం త్వరలో నిలిచి పోయిన పనులను పూర్తిచేసి అందించాలని తలిదండ్రులు కోరుతున్నారు.

ధాన్యం సొమ్ములు ఇప్పించండి మహాప్రభో


బాధిత రైతులు

పోలవరం, జూన్ 25 : ఆరుగాలం పండించిన ధాన్యం సొమ్ములు ఇవ్వాలని అడిగితే దళారి దాడులకు పాల్పడుతున్నాడని, తమకు ధాన్యం సొమ్ములు ఇప్పించి న్యాయం చేయాలని కొత్తపట్టిసీమ, పట్టిసీమ గ్రామ రైతులు వీరపు రాజు ధర్మరాజు తదితరులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మితే ఏడాదికి కూడా సొమ్ములు రావడం లేదని బయట దళారి మాదేపల్లి యూరి అనే కమీషన్ దారుడికి రూ.15 లక్షల విలువ గల ధాన్యం అప్పగించామని, రెండు రోజుల్లో ఇస్తామని చెప్పి ఏడాది గడిచినా సొమ్ములు ఇవ్వలేదని, అడిగితే దాడులకు పాల్పడుతున్నాడని అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూ టౌన్, జూన్ 25: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందే నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేసిన నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ తక్షణమే అందజేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. రైతులకు పంటరుణాలు, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య బండి వెంకటేశ్వరరావు, ఎండీ మున్నీర్, ఎస్.సాయిబాబు, ఎం.వెంకటాచారి, హేమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం

ఏలూరు టూ టౌన్, జూన్ 25: ప్రజాస్వామ్య చరిత్రలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌదరి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇందిరాగాంధీ ఇచ్చిన ఎమర్జెన్సీ చరిత్రలో అత్యంత ఘోరమైందని వ్యాఖ్యానించారు. అర్జుల మురళీ ఎం.దుర్గారావు, కే.కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు, రామ్ ప్రసాద్, వెంకట్రావు, ధానబాస్కర్, గాది రాంబాబు, గుమ్మడి చైతన్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కొణికి మాజీ సర్పంచ్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్,గంపా రాంబ్రహ్మం(ఇన్‌సెట్)

పెదపాడు, జూన్ 25 : కొణికి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గంపా రాంబ్రహ్మం (67) మంగళవారం తెల్లవారుజామున ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ తరపున 1988లో తొలిసారి సర్పంచ్‌గా ఎన్నికై ఆయయ మూడుసార్లు సేవలందించారు. రాంబ్రహ్మం మృతదేహాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రాంబ్రహ్మంకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పార్టీలతో పనిలేదు

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


చింతమనేనికి పుష్పగుచ్ఛం అందించి, అభినందిస్తున్న ఆలపాటి

పెదవేగి, జూన్ 25 : ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీలను చూడమని, సమస్యల పరిష్కారమే అజెండా గా పని చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఆలపాటి నరసింహమూర్తి, పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం చింతమనేని ప్రభాకర్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో పక్షపాతం లేకుండా పని చేయాలని ఆలపాటి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన చింతమనేని మాట్లాడుతూ పార్టీలనేవి ఎన్నికల వరకేనని, ఎన్నికల అనంతరం ఎమ్మెల్యేగా తాను పార్టీలకు అతీతంగా పనిచే యాల్సి ఉంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులోనూ అర్హులను చూస్తామే తప్ప పార్టీల పేరుతో అనర్హులను అందల మెక్కిం చమని ప్రభాకర్ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనా రాయణ, బలుసు లోకేశ్వర శ్రీనివాస్, ముసునూరి ప్రసాద్, రత్తయ్య, కొప్పాక గ్రామ సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది

ఎమ్మెల్యే రోషన్ కుమార్


రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం, జూన్ 25 : ప్రజల ఆరోగ్యం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఆసుపత్రిలోని గదులను, వార్డులను పరిశీలించారు. వార్డుల్లోని రోగులతో మాట్లాడారు. అనంతరం సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమల, ఇతర వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఐదేళ్లుగా ఆసుపత్రికి వచ్చిన నిధులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రభుత్వం మారి ఇన్ని రోజులైనా ఇంకా పాత ప్రభుత్వ బోర్డులే ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పలు లోపాలను గుర్తించానని వచ్చే నెలలో జరిగే సమావేశానికి వీటన్నిటినీ సరిదిద్దుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పోలీసు అవుట్ పోస్టు నిర్వహణ సరిగా లేదని సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, రామచంద్రాపురంలోని ప్రాథ మిక పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ విద్యారంగానికి కొత్త ఒరవడి తీసుకువస్తా రన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచినీటిని నాణ్యత కోసం ల్యాబ్‌కి పంపిస్తామన్నారు. తహసీల్దార్ కె.స్లీవ జోజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, మండల విద్యాశాఖాధికారులు బి.రాముడు, జి.రాములు, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, కూటమి నాయకులు రావూరి కృష్ణ, తూటిగుంట రాము, పరిమి సత్తిపం డు, ముస్తఫా, రామకుమార్, ఉమామహేశ్వరి, సీతారామ్, రామలక్ష్మి, సౌభాగ్యవతి, రాజాన పండు, ఆకుల రాకేష్, సాయిల సత్యనారాయణ, తూటి గుంట రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పర్యటన

కామవరపుకోట : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్థానిక పంచాయతీలోని కొత్తూరు చెక్‌పోస్టు సమీపంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద బుధవారం ఉదయం 10 గంటల కు విచ్చేస్తారని మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ తెలిపారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, విలేజ్ వీఆర్వోలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తారన్నారు.

బాలలతో భిక్షాటన చేయిస్తే చర్యలు


భిక్షాటన చేసేవారిని ప్రశ్నిస్తున్న బాలలసంరక్షణ అధికారిణి

ఏలూరు కలెక్టరేట్, జూన్ 25: బాలలతో భిక్షాటన చేయిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని, భిక్షాటన చేయిస్తూ ఉన్నవారిని గుర్తిస్తే వెంటనే సమాచారాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి, దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌ఆర్ పేట, పత్తేబాదలో నెలల వయస్సు కలిగిన బాలురుతో భిక్షాటన చేస్తున్న తల్లిని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సిబ్బంది ద్వారా గుర్తించి డీసీపీయూ కార్యాలయానికి తీసుకువచ్చి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్లపైకి వచ్చి భిక్షాటన చేస్తే ఇక నుంచి కేసులు బుక్ చేసి ఎఫ్ఐఆర్ చేయించి రిమాండ్‌కు తరలిస్తామని ఆమె హెచ్చరించారు.

మంచి స్థానాల కోసం ఉద్యోగుల వెతుకులాట

కొయ్యలగూడెం, జూన్ 25: ప్రభుత్వం మారడంతో ఉద్యోగుల్లో కదలికలు మొదలయ్యాయి. అన్ని శాఖల్లోనూ మార్పులు చేర్పులు జరిగే అవకాశాలు ఉన్నందున ఉద్యోగులు మంచిస్థానాలకు వెళ్ళడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ దిశగానే అనేక శాఖల్లోని ఉద్యోగులు మంచి స్థానాల్లో పోస్టింగు తెచ్చుకోవడానికి ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో లూప్‌లైన్‌లో ఉన్న ఉద్యోగులు ఈ ప్రభుత్వంలో మంచి స్థానాల్లో పోస్టింగులు ఇవ్వాలంటూ అడుగుతున్నారు. ఈ దశగా ఉద్యోగులు తమతమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అదే విధంగా నాయకులు కూడా తమ మండలానికి తమ గ్రామాలకు మంచి ఉద్యోగులను నియమించాలంటూ ఎమ్మెల్యేలను ఒత్తిడి చేస్తున్నారు. త్వరలోనే పోలీస్, రెవెన్యూ శాఖల్లో మార్పులు జరుగుతాయని ఊహాగానాలు కొనసాగుతున్నాయి. పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెంలో పోస్టింగ్ వేయించుకోవడానికి పోలీస్, రెవెన్యూ శాఖల్లో తమ తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని ఉద్యోగుల్లో పోస్టింగుల కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


ఏలూరులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూన్ 25: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. తూర్పువీధి విటలేశ్వర మున్సిపల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పేద విద్యారులకు దాతలు పుస్తకాలు, పెన్నులతో పాటు ఫీజులు కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, చోడే వెంకటరత్నం, మారం హనుమంతరావు, శ్రావణ్ కుమార్, గోపాలకృష్ణ, కృష్ణనాయుడు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- ఏలూరు రూరల్ : రూరల్ మండలం మాదేపల్లి, జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ నాగరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సత్యనారాయణ, హెచ్‌ఎం ఎస్.వెంకటలక్ష్మి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు కార్పొరేషన్ : పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును యువకులు దుశ్శాలువాతో సత్కరించారు. జనసేన మండల అధ్యక్షులు వీరంకి పండు పుట్టిన రోజు వేడుకలను కూడా నిర్వహించారు. పలు పాఠశాలల వద్ద విద్యార్థులకు పుస్తకాలు కిట్‌లను అందజేశారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, ఒబిలిశెట్టి శ్రావణగుప్త తదితరులు ఉన్నారు.
- టి.నరసాపురం : తిరుమలదేవిపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, వడ్డే శ్రీను, కృష్ణమూర్తి నాయుడు, నాని, శ్రీను, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.
- దెందులూరు :జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతమనేని సమకూర్చిన నోట్ పుస్తకాలను హెచ్‌ం శర్మ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. సర్పంచ్ యేసమ్మ, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి గారపాటి కొండయ్య చౌదరి, గ్రామ పార్టీ టీడీపీ అధ్యక్షుడు యిప్పిలి వెంకటేశ్వరావు ఉప సర్పంచ్ మరళీకృష్ణ, టీడీపీ నేతలు షేక్ జహీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- లింగపాలెం : రంగాపురంలోని ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ ముసునూరి రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : హైస్కూలులో పుస్తకాల పంపిణీ జరిగింది. కాగుపాడు సర్పంచ్ కడియాల విదూష్ణ, భర్త జానకిరాం, మాజీ సర్పంచ్ కడియాల రవిశంకర్, హెచ్‌ఎం తాతిన వెంకన్నబాబు పాల్గొన్నారు.
- పెదవేగి: బాపిరాజుగూడెం పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమకూర్చిన నోటు పుస్తకాలను ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలను ఎంఈవో -2 అరుణ్‌కుమార్, సర్పంచ్ జోగి పెదపెంటయ్య పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మద్దాల సహదేవుడు, తలకొండ జమలయ్య తదితరులు పాల్గొన్నారు.
- చింతలపూడి : కంద్రికగూడెం, పాతచింతలపూడిల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లను కూటమి నేతలు అందజేశారు. ఊటసముద్రం పంచాయతీ, కంద్రికగూడెంలో బీసీ నాయకులు కొమ్మరాజు సత్యనారాయణ, రాంబాబు, నాంచారయ్య, అప్పిరెడ్డినాగు పాల్గొనగా, పాత చింతలపూడిలో కూటమి నాయకులు అనిష్‌కుమార్, పక్కాల వెంకటేశ్వరరావు, రాజారత్నం, హెచ్‌ఎమ్ హేమలత, దామోదర్, పలువురు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో గోపాలపురం ఎమ్మెల్యే


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూన్ 25: ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన అనంతరం తొలిసారిగా మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం ద్వారకా తిరుమల చినవెంకన్నను సందర్శించారు. ఆయనకు ఆలయంలో ఘనస్వాగతం లభించింది. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వి.త్రినాథరావు ఆయనకు శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఆయన వెంట లంకా సత్యనారాయణ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, పోలిన శ్రీనివాసరావు, డీపీఎస్ చౌదరి, ఏపూరి దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధిద్దాం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధిద్దామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ అధికారి పనిని ప్రేమించాలని, అప్పుడే లక్ష్యసాధన సాధ్యమవుతుందన్నారు. మండల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఘంటాకి సత్కారం


ఘంటాను దుశ్శాలువాతో సత్కరిస్తున్న యువకులు

కామవరపుకోట, జూన్ 25 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడానికి చింతలపూడి నియోజకవర్గంలో ప్రముఖ పాత్ర వహించిన మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణను మండలంలోని నాయీ బ్రాహ్మణ, రజక, పలు సంఘాలకు చెందిన యువతీ, యువకులు దుశ్శాలువాతో మంగళవారం మురళీ నివాసగృహం వద్ద సత్కరించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు.

ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

ఏలూరు టూ టౌన్, జూన్ 25: ఎస్టీ ఉద్యోగులతో పాటు ఆదివాసీ, గిరిజన, సామాన్య ప్రజలందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కోసం కృషి చేస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అకిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బడేటి చంటిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళావతి, సుశీల, రాధ, సత్యభారతి, మణి, రమేష్, బాలరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత


పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమడోలు, జూన్ 25 : గ్రామ పంచాయతీలో మంగళవారం డ్రైనేజీ పూడికతీత, మంచినీటి ట్యాంకుల క్లీనింగ్ చేసే కార్యక్రమాలు నిర్వహించారు. మండల విస్తరణాధికారి సుందరి ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలను కలిసి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ పరిశుభ్రత, చిన్నారుల శుభ్రతపై పలు సూచనలు ఇచ్చారు. భీమడోలు మండలంలో ఈ నెల 26 నుంచి 29 వరకూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

క్రీడాకారిణిలకు నగదు బహుమతి

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 25:స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో క్రీడాకారిణిలకు మంగళవారం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు పాఠశాల క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రసన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కైకరం సంఘటనలో 17 మంది అరెస్టు

ఉంగుటూరు, జూన్ 25 : కైకరంలో ఆదివారం జరిగిన సంఘటనలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు 17 మందిని చేబ్రోలు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వైసీపీ నాయకుడు పుప్పాల గోపి ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి ఆయన తల్లి ఆదిలక్ష్మిని దుర్భాషలాడారని అదే సమయంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఇంటి ముందున్న కారు అద్దాలు పగుల గొట్టినట్లు చేసిన ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు జరపగా 17 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలను అరెస్టు చేయగా వారంతా స్టేషన్ బెయిల్ పొందారని ఎస్ఐ ఎ.మణి కుమార్ తెలిపారు. అయితే తాము అక్కడ లేకపోయినా తమను అన్యాయంగా అరెస్టు చేశారని జనసేన యువకులు, విద్యార్థులు పేర్కొన్నారు

పంచాయతీ సర్పంచ్ నీటి చౌర్యం

ఏలూరు రూరల్, జూన్ 25: ఏలూరు రూరల్ మండలంలో ఓ సర్పంచ్ నీటి చౌర్యానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గమనించి కుళాయికి డమ్మీ బిగించారు. సర్పంచ్‌పై కేసు నమోదు చేయనున్నారు. ఏలూరు రూరల్ మండలానికి చెందిన ఈ సర్పంచ్ కొంతకాలంగా నీటి చౌర్యానికి పాల్పడుతున్నాడు. కుళాయికి రెండు అడుగుల పైపు వాడాల్సి ఉండగా, మూడున్నర అంగుళాల పైపు వేశారు. దీంతో నీరు అధికంగా వాడుతున్నట్లు గుర్తించారు. స్థానికులు ఇదే విషయం పై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఏలూరు ఎంపీడీవో బి.ప్రణవి, ఈవోపీఆర్డీ సరళకుమారి అక్కడికి చేరుకుని పైప్‌లైన్‌ను పరిశీలించారు. వాడాల్సిన దానికన్నా పైప్ ఎక్కువగా ఉండడంతో పాటు అనధరైజ్డ్‌గా కుళాయి వాడుతున్నట్లు గుర్తించి కుళాయికి డమ్మీ బిగించారు. సమాచారాన్ని జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందజేస్తామని ఎంపీడీవో బి.ప్రణవి తెలిపారు. నీటి చౌర్యానికి పాల్పడటం శిక్షార్హమని, పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. వారి వెంట ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి సుమలత తదితరులు ఉన్నారు.

12 రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 25: విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ పరిధిలోని చాగల్లు, రాజమండ్రి సెక్షన్స్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్ల రాకపోకలు అక్టోబరు వరకు రద్దు చేశారు. వాటిలో కొన్నిటిని సెప్టెంబరు 16 వరకు మాత్రమే రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి పలు రైళ్లను అక్టోబరు వరకు రద్దు చేస్తున్నట్లు ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం వాటిలో 12 రైళ్లను సెప్టెంబరు 16 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మండ్రూప్కర్ తెలిపారు. ప్రత్యేక సర్వీసులుగా కొనసాగిస్తున్న మరో రెండు రైళ్లను పొడిగించారు. 07466, 07467 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి, 17257, 17258 విజయవాడ- కాకినాడ-విజయవాడ, 17219, 17220 మచిలీపట్నం-విశాఖ- మచిలీపట్నం, 17239, 17240 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22702, 22701 గుంటూరు- విశాఖ-గుంటూరు, 22708, 22707 తిరుపతి-విశాఖ-తిరుపతి రైళ్లు యథావి ధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు. నిడదవోలు- సామర్లకోట సెక్షన్ల నడుమ ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ రద్దు చేసిన 26 రైళ్లలో జన్మ భూమి, సర్కారు మాత్రమే పునరుద్ధరించారు. మిగతా రైళ్లు తాత్కాలిక రద్దు జాబితాలోనే ఉన్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 07153 నర్సాపురం - ఎస్ఎన్వీటీ బెంగళూరు (శుక్రవారం) ఈనెల 28 నుంచి ఆగస్టు 9 వరకు, 07154 ఎస్ఎన్విటి బెంగళూరు-నరసాపురం (శనివారం) జులై 6 నుంచి ఆగస్టు 10 వరకు పొడిగించారు.

1 నుంచి కొత్త న్యాయ చట్టాల అమలు

జంగారెడ్డిగూడెం, జూన్ 25: కొత్త న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి వస్తున్నాయని ఏలూరు జిల్లా ఏఎస్పీ జి.స్వరూప రాణి తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం విలే కరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు అమలులో ఉన్న సీఆర్పీసీ, ఐపీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ తదితర చట్టాలను మార్చుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వీటి స్థానంలో జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భార తీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం చట్టం (బీఎస్ఎ) అమలులోకి రానున్నాయన్నారు. ఈ చట్టాలపై ఇప్పటికే తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. డివిజన్ పరిధిలో 90శాతం సిబ్బంది శిక్షణ పొందారని తెలిపారు.



మాదక ద్రవ్యాలు వద్దంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మత్తుకు అలవాటుపడితే చిత్తే..

నూజివీడు, జూన్ 25: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ నూజివీడు శారద జూనియర్ కళాశాల, నవజీవన్ బాలభవన్ విజయవాడ ఆధ్వర్యంలో నూజివీడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.అప్పాజీ మాట్లాడుతూ మత్తుపదార్థాల సేవనం వల్ల శరీరంలోని ప్రతి అవయవం దెబ్బతిని, మత్తుకు బానిసైన వ్యక్తితో పాటు ఆ కుటుంబం కూడా నరకం చూడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. నవజీవన్ బాలభవన్ సిబ్బంది ఎం.బాబు, కనపర్తి రమేష్, శారద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ. రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూజివీడు పురవీధుల్లో మాదక ద్రవ్యాలు నిరోధం కోరుతూ ర్యాలీ నిర్వహించారు.

7వ రోజు అన్న క్యాంటీన్



కైకలూరు, జూన్ 25: దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 7వ రోజుకు చేరింది. కైకలూరు తాలుకా సెంటర్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ప్రారం భించారు. ముదునూరు కొండరాజు ఆర్థిక సాయంతో 400 మందికి అన్నదా నం చేశారు. కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, వీరాబత్తిన సుధా, గొట్టుముక్కల రంగరాజు, పెన్మెత్స అచ్యుత రాజు, ఎంపీటీసీ రామకృష్ణ, ముదునూరి నాగరాజు, పెరుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిపై చంద్రబాబు ప్రశంసల జల్లు


కుప్పం సభలో వైష్ణవి ఉదారతను వివరిస్తున్న సీఎం చంద్రబాబు

ముదినేపల్లి, జూన్ 25 : రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.26 లక్షల విరాళం ఇచ్చిన ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. మంగళవారం కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు తన ప్రసంగంలో వైష్ణవి విరాళం ఇచ్చిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ తమకున్న మూడు ఎకరాల భూమిలో ఒక ఎకరం పొలం అమ్మి రూ.25 లక్షలు అమరావతికి, బంగారు గాజులు అమ్మి రూ.లక్ష పోలవరం నిర్మాణానికి విరాళంగా ఇవ్వటం అందరికీ ఒక స్ఫూర్తి అన్నారు.


యనమదల జడ్పీ హైస్కూల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ

పాఠ్య పుస్తకాల పంపిణీ

నూజివీడు టౌన్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకుంటూ విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని, టీడీపీ నాయకుడు పల్లెర్లమూడి రామోజీ అన్నారు. నూజివీడు మండలం యనమదల జడ్పీ హైస్కూలులో పాఠ్యపుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామస్తులు బూరుగు జోషి, చిమటా శ్రీను, వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండి: పెదపుట్లపూడి మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, డీసీ మాజీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు పాఠ్య, నోటు పుస్తకాలు, కిట్లు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉప సర్పంచ్ ఛాయా దేవి, టీడీపీ నాయకులు అక్కల వెంకటాచలం, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, కొల్లాటి సత్యనారాయణ, గణపతి, నాగరాజు, వడుగు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

కలిదిండి, జూన్ 25 : విత్తన శుద్ధితోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు. కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలన్నారు. దంప నారుమళ్లకి అయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి నారుమడిలో చల్లుకోవాలన్నారు. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందు నీరు సరిపోతాయన్నారు. నారుమడిలో చల్లే ముందు 24 గంటలపాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలన్నారు. విత్తనశుద్ధి చేయటం వల్ల నారు ఏపుగా పెరిగి తెగుళ్ల ఆశించకుండా ఉంటాయన్నారు.



ఉక్కిరి బిక్కిరి

ఆగిరిపల్లి, జూన్ 25: వ్యర్థాల దహనంతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆగిరిపల్లి-గన్నవరం రోడ్డులో గల డంపింగ్ యార్డ్లో వ్యర్థాలకు నిప్పంటించడంతో పక్కనే ఉన్న పాఠశాలలో గల 600 మంది విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రహదారి మొత్తం ఈ పొగ ఆవరించడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు, స్కూల్ యాజమాన్యం కోరుతోంది. డంపింగ్ యార్డ్ ఊరికి దూరంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీబీ రహదారి అభివృద్ధికి మంత్రి చర్యలు


సమస్యలపై అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి, జూన్ 25: మండలంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన చిత్తపూరు-బూరుగ్గూడెం (సీబీ) ఆర్అండ్బీ రహదారి అభివృద్ధిపై నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, చిత్తపూరు- బూరుగ్గూడెం రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెయ్యాలని మంత్రి పార్థసారథిని కోరగా వెంటనే స్పందించిన మంత్రి ఆర్అండ్బీ శాఖ ఈఎన్సీకి అంచనాలు తయారు చేయాలని లేఖ రాశారు. ఈ మేరకు బసవారెడ్డి ఈఎన్సీని కలిసి మంత్రి లేఖను అందజేశారు. ఎన్నికల ప్రచారంలో కూడా పార్థసారథి ఈ రహదారిని అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో రెండేళ్ల క్రితం ఈ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరిస్తున్నట్లు అధికారులు సర్వే నిర్వహించారు కానీ అడుగు ముందుకు పడలేదు. ఇది డబుల్ రోడ్డు అయితే చాట్రాయి, చింతలపూడి మండలాలు, తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు విజయవాడ, నూజివీడు తదితర పట్టణాలకు వెళ్ళటానికి దగ్గర దారి ఏర్పడుతుంది. ఈఎన్సీ నుంచి అంచనాలు రాగానే పరిపాలనా ఆమోదం కోసం పంపుతానని మంత్రి హామీ ఇచ్చారని బసవారెడ్డి చెప్పారు. చిత్తపూరు-బూరుగ్గూడెం రహదారి అభివృద్ధిపై మంత్రి పార్థసారథి దృష్టి సారించినట్లు తెలియటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ళ నుంచి అపరిష్కృతంగా ఉన్న చిత్తపూరు-బూరుగ్గూడెం ఆర్అండ్బీ రహదారి సమస్య మంత్రి పార్థసారథి చొరవతో పరిష్కారం కానున్నదని బసవారెడ్డి అన్నారు.

ముసునూరు: గోపవరంలో సమస్యలను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి టీడీపీ నాయకులు తీసుకువెళ్ళారు. మంగళవారం నాయకు లు ఉప్పలపాటి గణేష్, సాయిల అనిల్, చిలకంటి శేషులు విజయవాడలో మంత్రి పార్థసారథిని కలిసి గత ప్రభుత్వ ఐదేళ్లపాలనలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ కాలనీల్లో డ్రైనేజీల పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉన్నాయని, అంతర్గత రహదారుల అభివృద్ధి లేదని తదితర సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత శాఖాధికారులతో ఫోన్లో మాట్లాడి, వీలైనంత త్వరగా గోపవరం పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పార్థసారథి చెప్పినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.


ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్కు బాలకృష్ణ ఫ్యాన్స్ వినతిపత్రం

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

కైకలూరు: కైకలూరులో ప్రజా అవసరాల దృష్ట్యా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని కైకలూరు బాలకృష్ణ ఫ్యాన్స్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ను కోరారు. మంగళవారం కైకలూరులో బాలకృష్ణ ఫ్యాన్స్ గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. కైకలూరులో పెద్ద వ్యాపారకూడలి ఉండడం వల్ల చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భారీగా ప్రజలు తమ అవసరాల నిమిత్తం కైకలూరు వస్తారని కానీ ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవతున్నారన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని బాలకృష్ణ ఫ్యాన్స్ లక్కింశెట్టి మోహన్, తదితరులు కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో అభివృద్ధి

ముదినేపల్లి: ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి కూడా సాధ్యమవు తుందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. అల్లూరులోని రేణుక ఎల్లమ్మ జాతరలో మంగళవారం ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికత ప్రజల్లో శాంతి, సామరస్యాలను పెంపొందిస్తుందన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉందని, గ్రామాల్లో మౌలిక వసతులు పెంపునకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్మెంట్ ఇన్చార్జ్ కొడాలి వినోద్, టీడీపీ నాయకులు బొర్రా చలమయ్య, పరసా విశ్వేశ్వరరావు, బొంగు రవికుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, అల్లూరు టీడీపీ నాయకులు పత్తి శివ, దాసరి శ్రీను, బర్ల రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు వైద్య పరీక్షలు

దివ్యాంగులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

కైకలూరు, జూన్ 25: దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం అన్నిరకాల ఉపకరణాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఎంఈఓ డి. రామారావు అన్నారు. మంగళవారం కైకలూరు భవిత కేంద్రంలో దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల దివ్యాంగులైన 1 నుంచి 18 ఏళ్ల వయస్సు కల్గిన ప్రత్యేక అవసరాల కల్గిన బాలబాలికలకు ఉచితంగా ఉపకరణాలను ఇచ్చేందుకు వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి మానసిక దివ్యాంగులు 40 మంది, అంగవైకల్యం కలిగిన 30 మంది, వినికిడి లోపం కల్గిన వారు 40 మంది, అంధత్వం కల్గిన వారు 10 మంది మొత్తం 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ బి. సోమశేఖర్, సమగ్ర శిక్ష విలీనవిద్య సమన్వయకర్త బొర్రా భాస్కరరాజు, ఎంఈఓ-2 వి. శ్రీనివాసరావు, నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ



ముసునూరు, జూన్ 25: మండలంలోని రమణక్కపేట మెయిన్ స్కూల్లో ఉన్న భవిత సెంటర్లో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ఫిజియో థెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు దివ్యాంగ చిన్నారులకు డాక్టర్ ప్రశాంతి ఫిజియోథెరపీ నిర్వహించి, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్టీలు డీఎంపీఎల్ నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న దృశ్యం



తోటపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాల వితరణ

మండవల్లి, జూన్ 25: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కైకలూరు నియోజకవర్గ కూటమి నాయకుడు, కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చాపరాల దుర్గాప్రసాద్ సూచించారు. మంగళవారం ఉనికిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చలసాని కోటేశ్వరరావు ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఉపాధ్యాయులు తోట మాధవి, గ్రామ ప్రముఖులు చలసాని కోటేశ్వరరావు, తమ్మినేని వెంకటేశ్వరరావు, జాజుల చింతారావు, తోట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందుకుని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని నూజివీడు నియోజకవర్గ బీసీ నేత ఆరేపల్లి శ్రీనివాస్ అన్నారు. తోటపల్లి ప్రి స్కూల్లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో గ్రామ పెద్ద ఎంఎల్ఎస్ఆర్కె ప్రసాద్ (బాబు) సుమారు రూ.15 వేల విలువైన నోట్ బుక్స్, పలకలు, పెన్నులు ఉచితంగా పంచారు. హెచ్ఎం తాడిశెట్టి శోభన్బాబు, సర్పంచ్ ఆరేపల్లి పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో నిందితుడిని చూపుతున్న డీఎస్పీ

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ముదినేపల్లి, జూన్ 25 : వివాహితతో సహజీవనం సాగిస్తూ మైనర్ బాలిక అయిన ఆమె కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఫిర్యాదుపై నిందితుడైన మఖవరపు ఉదయ్ కుమార్ (41)ను ముదినేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, సిబ్బంది నిందితుడిని అతని స్వగ్రామమైన ద్వారకా తిరుమల మండలం పి.కన్నాపురంలో అరెస్టు చేశారు. అనంతరం ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడు ఉదయ్ కుమార్ ప్రస్తుతం హైదరాబాద్లో నివాసం ఉంటూ తరచూ ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి తన బంధువుల ఇంటికి వస్తుండేవాడు. ఆ సమయంలో ఆ గ్రామంలోని ఒక ఒంటరి మహిళతో పరిచయమై ఏడాదిగా సహజీవనం సాగిస్తున్నాడు. ఆమె నుంచి రూ. 2.20 లక్షలు కూడా తీసుకున్నాడు. అంతేకాక ఆమె పదేళ్ల కుమార్తెపై పలుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మే నెల 18వ తేదీ తెల్లవారుజామున బాలికపై లైంగిక దాడికి దిగగా తల్లి అడ్డు వెళ్లింది. ఆమెను కొట్టి బెదిరించి వెళ్లిపోయాడు. అనంతరం గ్రామస్థులు కొందరు నిందితుడి తరఫున రాజీచేసి ఆమె వద్ద తీసుకున్న రూ.2.20 లక్షలు తిరిగి ఇప్పిస్తామని, ఈ ఘటనపై కేసు పెట్టవద్దని ఆమెను ఆపారు. ఈ నెల 16న మధ్యవర్తి జోగి సురేష్, ఉల్లంకి అశ్విని, ఆలపాటి కిషోర్, పళ్లం విజయలక్ష్మితోపాటు నిందితుడు ఉదయ్ కుమార్ ఆ మహిళ ఇంటికి వెళ్లి రాజీకి ఒత్తిడి చేశారు. ఆమె అంగీకరించకపోవటంతో ఆమెపై దాడి చేశారు. దీనిపై ఈ నెల 17న కేసు నమోదు చేయగా, ఏలూరు దిశ పోలీస్స్టేషన్ డీఎస్పీ మురళీకృష్ణ దర్యాప్తు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు ఉదయ్ కుమార్ను మంగళవారం అరెస్టు చేయగా, మిగిలిన నలుగురిని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న ముదినేపల్లి హెచ్సీ శంకర్రావు, కానిస్టేబుల్ బి.నాగబాబును డీఎస్పీ అభినందించారు.

క్రైం సమాచారం

సర్పంచ్ భర్త లైంగిక వేధింపులపై కేసు నమోదు

ముసునూరు, జూన్ 25: సర్పంచ్ భర్త తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న బాధితురాలి ఫిర్యాదుపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేటకు చెందిన మహిళ సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉండగా సర్పంచ్ భర్త రంగు గాంధీ లైంగిక వేధింపులకు దిగాడని, దీంతో తాను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా నిందితుడు పారిపోయాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గతంలో తనను గాంధీ వేధింపులకు గురి చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు చేశారే తప్ప న్యాయం చేయలేదని ఆరోపించింది. నిందితుడిపై చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించాలని ఆమె ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

కలిదిండి, జూన్ 25: ఆరుతెగలపాడుకు చెందిన మాడపాటి ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన గొల్లేరు సురేష్ బాబుపై ఈ నెల 23న కత్తితో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. తన భార్యతో సురేష్బాబు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో ఆంజనేయులు సురేష్బాబుపై హత్యాయత్నం చేశాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

రూ. 6.5 కోట్లకు పెరిగిన పెన్షన్ బడ్జెట్

చాట్రాయి, జూన్ 25: చాట్రాయి మండలంలో ఈ నెల సామాజిక పెన్షన్ల బడ్జెట్ రూ. 2.55 కోట్ల నుంచి రూ 6.50 కోట్లకు చేరనున్నది. ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేయటంతో పెన్షన్దారుల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ నెలలో మండలంలో మొత్తం 8577 మంది పెన్షనర్లకు రూ. 2.55 కోట్లు పంపిణీ చేశారు. ఈ నెలలో పెరిగిన పెన్షన్ రూ. 4 వేలతో పాటు, ఏప్రిల్, మే జూన్ నెలలకు రూ. వెయ్యి చొప్పున కలిపి రూ. 7వేలు చెల్లించనుండటంతో బడ్జెట్ భారీగా పెరిగింది. మండలంలో వృద్ధాప్య పెన్షన్లు 4551, వితంతువు 1660, గీత కార్మికులు 414, డప్పు కళాకారులు 285, చర్మకారులు 521, ఒంటరి మహిళలు 145, దివ్యాంగులు 785, డీహెచ్ఎం 27, ట్రాన్స్జెండర్ 1, ఏబీహెచ్ 131, ఇతరులు 86 ఉన్నాయి. అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పెరిగిన పెన్షన్ల ప్రకారం బడ్జెట్ రూపొందించి ఎంపీడీవోతో ఉన్నతాధికారులకు పంపుతున్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ



నూజివీడు టౌన్, జూన్ 25: ఉపాధి హామీ పథకంలో అవినీతి చోటు చేసుకుంటోందని, పూర్తిస్థాయి విచారణ జరిపించాలని రామన్నగూడెం గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ, పీవీ నాగేంద్రరావు నూజివీడు ఎంపీడీవోకు సోమవారం ఫిర్యాదు చేయడంతో ఉపాధి ఏపీవో సోమేశ్వరి రామన్నగూడెంలో మంగళవారం విచారణ నిర్వహించారు. గత ఐదేళ్లుగా ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ మారుమూడి అచ్చియ్య అనేక అక్రమాలకు పాల్పడ్డాడని, గ్రామంలో ఒక్కరోజు కూడా పదిమందితో కూడా పని చేయించలేదని, అయినా ప్రతిరోజూ 200కు పైగా కూలీలు పనిచేస్తున్నట్లుగా రికార్డుల్లో చూపటాన్ని బట్టి చూస్తే రామన్నగూడెం ఉపాధి హామీ పనుల్లో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని ఉపాధిహామీ పనుల నుంచి తొలగించడంతో పాటు అన్యాక్రాంతమైన నిధులను రికవరీ చేయాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం ఇచ్చారు. విచారణలో గ్రామసులు ఎస్. రాజారావు, ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూన్ 25: పల్లెవాడ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఆ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె. రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సబ్స్టేషన్ పరిధిలోని పల్లెవాడ, చిన్నరామవరం, గోనెపాడు, భుజబలపట్నం, చటాకాయ్, నత్తగుల్లపాడు, కొల్లేరు గ్రామాల్లోనూ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి శిక్షణ

కైకలూరు, జూన్ 25: నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ఈ నెల 29 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన 4.0 సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా అర్హత కల్గిన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనకు పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన యువతీ యువకులు ఈ హబ్లో శిక్షణ పొందవచ్చన్నారు. 30 ఏళ్ల లోపు గల వారికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కొరకు స్కిల్హబ్ కో-ఆర్డినేటర్ వరప్రసాద్, సెల్ నెంబర్ 97013 57315, 62811 19575లలో సంప్రదించాలని కోరారు.

శరవేగంగా తాగునీటి చెరువుల తవ్వకాలు



కలిదిండి, జూన్ 25 : కోరుకొల్లులో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన తాగునీటి చెరువు తవ్వకాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్స్కవేటర్తో చెరువులో పూడికను తీస్తున్నారు. ఈ నెల 19న తాగునీటి చెరువు తవ్వకాల పనులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అప్పటి నుంచి సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో చెరువు తవ్వకాల పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. తాగునీటి వంతు విడుదల చేసే సమయానికి చెరువు తవ్వకాల పనులు పూర్తి చేయటానికి కృషి చేస్తున్నామని, తవ్వకాలు పూర్తి కాగానే తాగునీటి చెరువును పూర్తి స్థాయిలో నింపి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ లీలా కనకదుర్గ తెలిపారు.



ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఫాగింగ్

నూజివీడు టౌన్, జూన్ 25: నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో దోమలు వ్యాప్తి చెందకుండా మున్సిపల్ అధికారులు ఫాగింగ్ నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కాలనీలో విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తగా ఫాగింగ్ నిర్వహించడంతో పాటు మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాల్సిందిగా కాలనీ వాసులకు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు వివరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



ముసునూరు, జూన్ 25: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముసునూరు పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పారుశుధ్య పనుల చేపట్టారు. మంగళవారం గ్రామంలో ప్రధాన, అంతర్గత రహదారుల వెంబడి ఉన్న మురుగునీటి నిల్వలు, డ్రైనేజీల్లో దోమల నివారణ మందును పారిశుధ్య కార్మికులు పిచికారీ చేసి, బ్లీచింగ్ చల్లారు. హెల్త్సూపర్వైజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.